క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ కొత్త లైనుల ఏర్పాటు దృష్ట్యా నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం ఏర్పడుతుందని గుంటూరు–1 సబ్ డివిజన్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ ముస్తాక్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు. సంగడిగుంట, లాంచెస్టర్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి



గుంటూరు మెడికల్: విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరిచిపోరని ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని అహల్య హాస్పిటల్‌లో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ మాట్లాడుతూ నర్సుల వృత్తికి గౌరవాన్ని, ఖ్యాతిని తెచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని నేడు ప్రపంచ వ్యాప్తంగా నర్సులు చేసుకుంటున్నారన్నారు. నిస్వార్థంగా నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. డాక్టర్ శనక్కాయల రాజకుమారి మాట్లాడుతూ రోగులను సొంత వారిలా చూసుకుంటారని చెప్పారు. చిరునవ్వుతో, మానవత్వంతో సేవలందించే ప్రతి నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ హేమ, డాక్టర్ సిరి, అహల్య పాల్గొన్నారు.

23న పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ ప్రార్థన సభ

నెహ్రూనగర్: గుంటూరులోని ఎల్ఈఎం స్కూల్ కాంపౌండ్‌లో పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ ప్రార్థన సభ ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు దళిత క్రైస్తవ నాయకులు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు తెలిపారు. సోమవారం అరండల్‌పేట్‌లోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదే రోజు పాత గుంటూరు నుంచి ఎల్ఈఎం స్కూల్ వరకు ప్రవీణ్ ఫొటోలతో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. తొలుత సభకు సంబంధించిన కరప్రతాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు మద్దు ప్రేమజ్యోతిబాబు, గద్దె రత్నకుమారి, సురేష్ జేమ్స్, ఆరుమళ్ల మార్క్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల అంతరాష్ట్ర దొంగ అరెస్ట్

లక్ష్మీపురం: ద్విచక్ర వాహనాల అంతరాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. దేవాపురం రెండో లైన్‌కు చెందిన పులి రమేష్, పలు దొంగతనం కేసుల్లో నిందుతుడిగా ఉన్నాడు. పట్టాభిపురం ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ, ఎస్ఐలు సుబ్బారావు, నరహరి, సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా గాలింపులు ప్రారంభించారు. రమేష్ ఇంట్లో తనిఖీ చేసి రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. రమేష్ జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలను చోరీ చేయడం ప్రారంభించినట్లు పోలీస్ విచారణలో తేలింది. సుమారు 50కి పైగా దొంగతనం కేసుల్లో ఉన్నాడు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ కూడా ఉంది. నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉన్నట్లు సీఐ చెప్పారు.

యువకుడిపై దాడి

లక్ష్మీపురం: యువకుడిపై పలువురు దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. శారదాకాలనీ ప్రాంతానికి చెందిన జీవన్ అనే యువకుడు చదువుకునే రోజుల్లో విద్యార్థినితో స్నేహంగా ఉండేవాడు. అది నచ్చని ఆ విద్యార్థినిని తల్లి దండ్రులు తరుచూ యువకుడితో గొడవ పడుతూ ఉండే వారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విద్యార్థిని తండ్రి అనిల్, బాబాయి, మరి కొందరు కలిసి జీవన్ పై దాడి చేసి కర్రలతో కొట్టి గాయపరిచారు. దీంతో స్థానికుల సహాయంతో ఆస్పత్రిలో చికిత్స పొంది చికిత్స పొందారు. సోమవారం రాత్రి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు కాల్వలు నిర్మించండి

తెనాలిఅర్బన్: 12వ వార్డు డొంక రోడ్డులో 12 సంవత్సరాల కిందట సిమెంట్ రోడ్డును నిర్మించి కాలువలు నిర్మించలేదని, దీనివలన మురుగు పోయే దారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసి శ్రీను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కాలువలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆర్‌వో రాంప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పక్కాగా తాగునీరు అందించేందుకు కృషి

మేయర్ రవీంద్ర



మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, పక్కన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో ప్రతి ప్రాంతానికి సమగ్రంగా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అమృత్ 2.0లో భాగంగా సమగ్ర తాగునీటి పథకం అమలుకు రూపొందించిన డీపీఆర్‌పై సలహాలు, సూచనలు కోసం నగరంలోని స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటీజన్స్, ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో 2014 నుంచి 24/7 తాగునీరు అందిస్తామని నగర పాలక సంస్థ ప్రకటిస్తున్నా ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉందని, రానున్న కాలంలో ప్రతి ప్రాంతానికి నీటిని పుష్కలంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చర్యలు తీసుకుంటామని చెప్పారు. గోరంట్ల కొండ మీద నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని వివరించారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన గోరంట్ల ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని రిజర్వాయర్లను ప్రతి నెల నిర్దేశిత సమయానికి తప్పనిసరిగా శుభ్రం చేయించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ అమృత్ 2.0 భాగంగా రానున్న 30 ఏళ్ల వరకు ప్రజలకు తాగునీటి అవసరాలను అంచనా వేసి అమృత్ యూఐడీఎఫ్ నిధుల ద్వారా సుమారు రూ.540 కోట్ల అంచనాలతో డీపీఆర్ రూపొందించామని, పనులను రెండేళ్ల కాల పరిమితితో పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నామని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌లు పూర్తయితే నగర ప్రజలకు తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తే అవకాశం ఉండదని చెప్పారు. డీపీఆర్‌పై ప్రజా ప్రతినిధులు, స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటీజన్లు అందించే సూచనలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మురళీనాయక్ మృతికి నివాళి

నెహ్రూనగర్: జమ్మూ కశ్మీర్ సరిహద్దులో పాకిస్తాన్ ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ మరణం దేశానికి తీరని లోటని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డెప్యూటీ మేయర్ సజీల పేర్కొన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అమరుడైన ఆర్మీ జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే పాకిస్తాన్‌తో జరిగే యుద్ధంలో పోరాడి మరణించడం బాధాకరమన్నారు.

సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డెప్యూటీ కమిషనర్లు

నెహ్రూనగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కమిషనర్ ఆదేశాల మేరకు డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, విభాగాధిపతులు కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద పీజీఆర్ఎస్ సోమవారం నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 17 ఫిర్యాదులు అందుకున్నారు. తూ డయల్ యువర్ కమిషనర్‌కు అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని వారు కోరారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని చెప్పారు. అనంతరం నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద పీజీఆర్ఎస్ ద్వారా 37 ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి 17, ఇంజినీరింగ్ విభాగానికి 12, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 1, ఉపా సెల్ విభాగానికి సంబంధించి 3 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, బయాలజిస్ట్ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

లబ్ధిదారుల వ్యక్తిగత సమాచారం లీక్‌పై ఫిర్యాదు

నెహ్రూనగర్: బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ లోన్లు ప్రక్రియకు సంబంధించి అధికారులు దరఖాస్తులు స్వీకరించారని.. సదరు దరఖాస్తుదారుల వివరాలను ఉపా సెల్ అధికారులు లీక్ చేసి అధికారి పార్టీ వార్డు ప్రెసిడెంట్లకు చేరవేస్తున్నారని రజకవృత్తి దోబీఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించి పీజీఆర్ఎస్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. వార్డుల వారీగా సమాచారాన్ని ఉపా సెల్ అధికారులు అధికార పార్టీ నాయకులకు అప్పగిస్తున్నారని.. ఈ క్రమంలో నాకు కూడా ఒకటో వార్డు ప్రెసిడెంట్ అని ఫోన్ చేసి లోన్‌కు సంబంధించిన వివరాలు అన్ని అడిగారన్నారు. మేము చెబితేనే లోన్ మంజూరవుతుందని చెప్పారని ఫిర్యాదులో ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పిలుపునిచ్చారు. సోమవారం శ్రీనివాసరావు తోటలోని మస్టర్ పాయింట్ వద్ద కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువస్తున్నారని, వీటి ద్వారా కార్మికులను బానిసలుగా మార్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో సోమవారం చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో జరగ్గా, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేద పండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నియంత్రణకు చర్యలు



తెనాలిఅర్బన్: ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. ఆర్ఆర్‌నగర్‌లోని గిరిజన, షెడ్యూలు కులాల బాలికల వసతి గృహాల్లో మలాథియాన్ పిచికారీ చేసిన మందును సోమవారం స్ప్రే చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. దీనిని స్ప్రే చేయడం వలన దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు సోకవని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సిబ్బంది దీపాల శ్రీనివాసరావు, బందారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, షేక్ నవీద్, షేక్ రషీద్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనండి

కొల్లిపర: రాష్ట్రంలో లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కొల్లిపర మండలంలోని కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబూ ప్రసాద్ కోరారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎం.జయప్రద అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు అమలైతే కార్మిక చట్టాలు వర్తించవని కార్మికవర్గం బానిసత్వంలోకి నెట్టబడే పరిస్థితి వస్తుందని తెలిపారు. సంఘం పెట్టుకునే హక్కు లేకుండానే పోతుందని అన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని, సామాజిక భద్రత అమలు చేయాలని కోరితే మోదీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా అమలు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని రైతులు కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోటా చంద్రశేఖరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు నిర్మల జ్యోతి, శేషారత్నం, ఎం.వసంతకుమారి, వరలక్ష్మి, కుర్ర శివ లీల, అరుణ, తిరుపతమ్మ, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తిరంజని



భక్తి సంగీత విభావరి



భక్తులకు హారతి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై స్వరరాగ సుధ ఆధ్వర్యంలో సోమవారం అన్నమయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన భక్తి సంగీత విభావరి అలరించింది. గాయని, గాయకులు కేవీ సాయిబాబాశర్మ, నాగమల్లేశ్వరరావు, కృష్ణకుమారి తమ గాత్రధారణలో అన్నమాచార్య విరచిత పలు భక్తి గీతాలు ఆలపించారు. కళాకారులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

వైభవంగా అన్నమయ్య జయంతి వేడుకలు..

ఆలయ ప్రాంగణంలోని అన్నమాచార్య విగ్రహం వద్ద సోమవారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి, ఆలయ కమిటీ సంయుక్తంగా అన్నమాచార్య జయంతి వేడుకలు నిర్వహించారు. మూలవిరాట్‌కు వేదపండితులు సతీష్ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు అలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో సన్మండలి ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి, డాక్టర్ మైలవరపు లలితకుమారి, ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి



పాటల పోటీల విజేతలతో అతిథులు

తెనాలి: పదకవితా పితామహుడు అన్నమాచార్య జయంతి ఉత్సవాలు సోమవారం సాయంత్రం స్థానిక గీతామందిరంలో నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరస్వామికి, అన్నమయ్యకు అర్చన చేశారు. అన్నమయ్య జీవిత విశేషాలు, ఆయన రాసిన సంకీర్తనలు గుర్తుచేసుకున్నారు. ఈనెల నాలుగో తేదీన నిర్వహించిన అన్నమయ్య పాటల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. పాటల పోటీల్లో పాల్గొన్న 60 మంది చిన్నారుల్లో 25 మందిని, సీనియర్స్‌లో 40 మందికిగాను ఆరుగురిని ఎంపిక చేసి జ్ఞాపిక, నగదు బహుమతులను అందజేశారు. అనంతరం ప్రముఖ జ్యోతిష్య పండితుడు రాళ్లబండి చంద్రశేఖర్, నృత్యగురువు, చల్లా యామిని, సంగీత గురువు కామిశెట్టి పావనిని సన్మానించారు. ఈఎల్‌వీ అప్పారావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా వేద పండితుడు విష్ణుభట్ల యజ్ఞరామకృష్ణ పౌండరీక యాజులు, పంచాంగ రామానుజాచార్యులు, గౌరవరఘుల ఆంజనేయశాస్త్రి, కృత్తివెంటి కమల, సుజాత, టీవీఎస్ శాస్త్రి, పర్చూరు సుబ్బారావు, నరసింహారావు మాట్లాడారు. కేవలం పిల్లల్లో భక్తి భావం పెంచడానికి, అన్నమయ్య సంకీర్తనల ప్రచార నిమిత్తం ఈ కార్యక్రమాలను జరుపుతున్నామని సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు చెప్పారు. కొండపి వసుంధర, అన్నమయ్య రమాదేవి, రజిని, నంబూరి వినతి, సావిత్రి,లక్కరాజు కనకదుర్గ, మాదల సత్యకుమారి, కల్యాణి, కోగంటి నాగమణి, మూర్తి అనురాధ, బాలాత్రిపుర సుందరి పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ప్రభాకర్

గుంటూరు రూరల్: మానవ సేవే మాధవ సేవ అనే విధంగా గోవర్ధన్ గిరిధారి సేవా సమితి పాత గుంటూరు ఆధ్వర్యంలో నిరంతరం సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ తెలిపారు. గోవర్ధన్ గిరిధారి సేవా సమితి ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం గోరంట్లలోని సమర్థనమ్ ట్రస్ట్ ఫర్ ది డిసేబుల్డ్ విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ నేటి యువత ఇలాంటి సేవ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరు పేదలకు సేవ కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన గోవర్ధన్ గిరిధారి సేవా సమితి పాత గుంటూరు నిర్వాహకులు చావలి మాధవరాజీను అభినందించారు. కార్యక్రమంలో తాళ్ల నాగరాజు, కొండెపు శేఖర్‌బాబు, నల్లమేకల శ్రీనివాసరావు, కొండా రవి, పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



గుంటూరు రూరల్: పెదనందిపాడులోని కొల్లా వెంకయ్య మెమోరియల్ లైబ్రరీలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో కంప్యూటర్ కోచింగ్ తీసుకున్న రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. లైబ్రరీ చైర్మన్ డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ చిగురుపాటి నికిత, కంప్యూటర్ టీచర్ నాగేశ్వరరావు, జవహర్ రాణి, కొల్లా నిర్మల, కొల్లా రామన్‌లు కంప్యూటర్ కోర్సుల ఉపయోగాలను వివరించి, సర్టిఫికెట్లను అందజేశారు. లైబ్రేరియన్ నాగజ్యోతి మాట్లాడుతూ త్వరలో ఫ్లోక్, భరతనాట్యం, కంప్యూటర్ కోర్సులను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బోదావుల హనుమంతరావు, గారపాటి రమేష్, కొల్లా వెంకయ్య చౌదరి, ప్రసాద్, జూపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

వేడుకగా ఉత్సవమూర్తి ఊరేగింపు



గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులో గల శ్రీ పుష్యాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఆకాశమల్లేశ్వరస్వామి క్షేత్రాల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కల్యాణ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకారం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. వందలాదిగా పాల్గొని స్వామి తీర్థ ప్రసాదం స్వీకరించారు. మధ్యాహ్నం మహాన్నదానం చేశారు. రాత్రి కార్యక్రమాల్లో భాగంగా ఉత్సవమూర్తిని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆసాంతం భజంత్రీలు, కోలాటాలతో ఆకట్టుకుంది. గ్రామంలోని మహిళలు వార్లు పోసి స్వామికి స్వాగతం పలికారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

విధులకు సకాలంలో హాజరు కావాలి

తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. 3వ శానిటేషన్ డివిజన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదని తెలిపారు. కార్మికులందరూ ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించారు.

జీతాల విడుదల మాట నిలబెట్టుకోవాలి



లక్ష్మీపురం: ఆయుష్మాన్ ఆరోగ్య మిత్రాలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌గా పనిచేస్తున్న సీహెచ్‌ఓలకు జీతాలు విడుదల చేస్తామని ప్రభుత్వం మాట ఇచ్చిందని, దాన్ని నిలబెట్టుకోవాలని ఏపీఎం సీఏ ప్రెసిడెంట్ టి.ప్రవళిక కోరారు. సీహెచ్‌ఓలు చేపట్టిన సమ్మె సోమవారానికి 15 రోజుకు చేరింది. ఆమె మాట్లాడుతూ పెండింగ్ ఇన్సెంటివ్ విడుదల చేశామని జీఓ ఇచ్చారు, కానీ అవి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదన్నారు. గతనెల జీతం ఆపేశారన్నారు. తక్షణమే మా జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందరర్భంగా విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను మరిచిపోయారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జి.వనజ, ట్రెజరర్ సంధ్య, జిల్లా నాయకులు జ్యోత్స్న పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

తెనాలిరూరల్: బైక్ చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కఠెవరం గ్రామానికి చెందిన నాగసాయికృష్ణ తన పల్సర్ బైక్‌ను గత నెల 30వ తేదీ రాత్రి ఇంటి ముందు నిలిపాడు. మర్నాడు ఉదయం లేచే సరికి బైక్ కనబడక పోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి నిందితులను కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన అబూబకర్ బేగ్, బాలగంగాధర్ తిలక్‌లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి బైక్‌ను రికవర్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితులు గతంలో గుడివాడ వన్ టౌన్, టూ టౌన్, మచిలీపట్నం, హనుమాన్‌జంక్షన్, రాజమండ్రి టౌన్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పలు నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చారని ఎస్ఐ తెలిపారు.

ప్రేక్షకులను ఆకట్టుకున్న చింతామణి నాటకం



తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని రాజుల కాలనీలో నిర్వహిస్తున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా ప్రదర్శిస్తున్న సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం రాత్రి ప్రదర్శించిన చింతామణి పౌరాణిక నాటకం (భవానీ శంకరుని సీను) ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. భవానీ శంకరుడిగా తాడిబోయిన నాగేశ్వరరావు, చింతామణిగా రమణాంజలి నటించి ప్రేక్షకులను మెప్పించారు. తాడిబోయిన నాగేశ్వరరావు ఆలపించిన పద్యాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం వేషధారులను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో గంపల శివనాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, పూసపాటి కొండంరాజు, అశోక్ గజపతిరాజు, వెంకటేశ్వరరాజు, నారాయణరాజు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



గుంటూరు రూరల్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం లాం లోని కళాశాలలో మెడిక్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పారని తెలిపారు. వైద్యుల బృందం విద్యార్థులకు కంటి, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చలపతి విద్యా సంస్థల చైర్మన్ వై.వి. ఆంజనేయులు, సెక్రటరీ వై. సుజిత్‌కుమార్, డాక్టర్ డి.తిరుపతినాయుడు, డాక్టర్ ఆర్. శ్రీనివాసులు పాల్గొన్నారు.